కాలుష్యం కోరల్లో యనమదుర్రు

- దుర్గంధం వెదజల్లుతున్న నీరు
- ప్రక్షాళన చేయాలంటున్న ప్రజలు


పాతపాడులో ప్రవహిస్తున్న యనమదుర్రు డ్రెయిన్

మొగల్తూరు: రవాణా సౌకర్యం లేని రోజుల్లో పడవలపై, లాంచీలపై యనమదుర్రు డ్రెయిన్‌పై ప్రయాణించే వారు. అదే నీటితో తమ దాహార్తిని తీర్చుకునేవారు. మత్స్యకారులు తమ జీవనాధారమైన వేటను సాగించేవారు. ప్రయాణికుల దాహార్తిని, మత్స్యకార కుటుంబాలను ఆదుకునే యనమదుర్రు డ్రెయిన్ నేడు కాలుష్యం బారిన పడింది.

కలుషితమైన డ్రెయిన్

నిడదవోలు మండలం నందమూరు గరువులో ప్రారంభమై భీమవరం మండలం నాగిడిపాలెం అక్కడ నుంచి మొగల్తూరు మండలం పాతపాడు వరకు సుమారు 60.2 కి.మీ ప్రవహిస్తుంది. పాతపాడు నుంచి కాళీపట్నంలోని ఉప్పుటేరులో కలిసి, పేరుపాలెం వరకు ప్రవహించి అక్కడ సముద్రపు మొగలో సముద్రంలో కలుస్తుంది. ఇంత సుదీర్ఘంగా ప్రవహించే యనమదుర్రు డ్రెయిన్ కాలుష్య కోరల్లో చిక్కుకుంది. ఎగువ ప్రాంతంలో వదిలే కాలుష్య నీటితో డ్రెయిన్ పక్కన నుంచి నడవడానికే భయపడుతున్నారు. ఎగువ ప్రాంతంలోని పరిశ్రమల నుంచి వెలువడే మొలాసిస్ అదే ప్రాంతంలో ప్రవహిస్తున్న గోస్తనీ నదిలో కలిసి అక్కడ నుంచి యనమదుర్రు డ్రెయిన్‌లో కలుస్తుంది. వేండ్ర పేపర్ మిల్లు, భీమవరం మండలంలోని పలు రొయ్యల పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలతో డ్రెయిన్ కలుషితమైంది.

నివాసాల నుంచి వదిలే వ్యర్థాలూ ఈ డ్రెయిన్‌లోనే

ఈ డ్రెయిన్ భీమవరం పట్టణం మధ్య నుంచి ప్రవహిస్తుండటంతో పట్టణ ప్రజలు వదిలే వ్యర్థాలన్నీ దీంట్లో కలవడం కూడా కాలుష్యమవడానికి కారణం. పరిశ్రమలు ఏర్పాటు చేసేముందు సవాలక్ష నిబంధనలు విధించే అధికారులు ఆ తర్వాత పట్టించుకోకపోవడంతోనే డ్రెయిన్లు కాలుష్యం బారిన పడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వేటను కోల్పోయారు



యనమదుర్రు డ్రెయిన్ కాలుష్యమవడంతో మత్స్యకారులు వేటను కోల్పోయారు. డ్రెయిన్‌లో నీరు తీవ్ర దుర్వాసన వెదజల్లడంతో పాటు మత్స్య సంపద హరించుకుపోతోంది.

– రేవు నారాయణ మూర్తి, కొత్తోట

నీటిని తాగితే రోగాల వ్యాప్తి



కాలుష్య కారకంగా తయారైన యనమదుర్రు డ్రెయిన్ నీటిని తాగితే అనారోగ్యం బారిన పడుతున్నారు. డ్రెయిన్ వెంబడి నడిచి వెళితేనే దుర్గంధం భరించలేని పరిస్థితి నెలకొంది. ఎగువ ప్రాంతంలోని పరిశ్రమలు తగు జాగ్రత్తలు తీసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఆండ్రాజు షరాబందు, కాళీపట్నం

కిల్కారి మొబైల్ సేవలు ఎంతో ఉపయోగం


లంకలకోడేరు పీహెచ్‌సీలో కిల్కారి మొబైల్ సేవలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: ప్రతి గర్భిణి ఆరోగ్యకరమైన పండంటి బిడ్డకు జన్మనివ్వడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారికి ఆరోగ్యకరమైన విషయాలపై అవగాహన కల్పించాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం నవ్యజీవన్ కోరారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో శుక్రవారం గర్భిణులకు కిల్కారి మొబైల్ సేవలు ఎలా అందించాలో ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ప్రతి రోజు ఆశ కార్యకర్తలు గర్భిణి ఇంటికి వెళ్లి కిల్కారి మొబైల్ సేవల సేవలు ద్వారా అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్‌ఎన్ పి ఎలిజబెత్, సూపర్‌వైజర్ డి కమల, ఎస్‌కే అమరేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తీర ప్రాంత గ్రామాల్లో పంట బోదెల తవ్వకం


పంటబోదె తవ్వుతున్న ఉపాధి కూలీలు

మొగల్తూరు: తీర ప్రాంత గ్రామాలైన కేపీపాలెం నార్త్, సౌత్, పేరుపాలెం నార్త్, సౌత్ గ్రామాల్లో పంట బోదె తవ్వకాలు చురుగ్గా కొనసాగుతున్నాయి. వ్యవసాయ పనులు పూర్తికావడంతో పాటు కేపీపాలెం మంచి నీటి చెరువును పూర్తిస్థాయిలో నింపారు. ఇక ఉన్న నీటిని కొబ్బరి, సరుగుడు, మామిడి తోటలకు పూర్తిస్థాయిలో నీరు అందేలా పంట బోదెలు తవ్వకాలు చేపట్టారు. శుక్రవారం కేపీపాలెం సౌత్ గ్రామంలోని ప్రధాన పంట బోదెలో గుర్రపు డెక్క, మట్టి మేటలు వేయడంతో వాటిని తొలగించేందుకు పంట బోదె తవ్వకాలు చేపట్టారు. అధికారుల ఆదేశాల మేరకు నీరు వృథా కాకుండా తోటలకు నీరందేలా పంట బోదెలు తవ్వకాలు చేపట్టామని టీఏ వెంకటేశ్వరరావు తెలిపారు.

ప్రశాంతంగా 'పది' సప్లిమెంటరీ

పెనుగొండ: పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం తెలుగు పరీక్షకు పెనుగొండ మండలంలో 282 మంది విద్యార్థులకు, 103 మంది హాజరయ్యారని ఎంఈవో డి శుభకరరావు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

జోరు వానతో రైతులకు ఇక్కట్లు


జోరు వానకు ఊగుతున్న కొబ్బరిచెట్లు

యలమంచిలి: అకస్మాత్తుగా శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షంతో ప్రజలు సేద తీరారు. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని వార్తలు వస్తున్న నేపథ్యంలో వర్షం సాధారణ ప్రజలకు ఉపశమనం కలిగించినా రైతులకు మాత్రం గుండెల్లో రైళ్లు పరిగెట్టించింది. యంత్రాలతో వరి పంట కోసిన రైతులు ధాన్యంలో తేమ శాతం తగ్గించడానికి రాశుల్లో ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. ఒక్కసారిగా మబ్బులు కమ్మడంతో రైతులంతా అప్రమత్తమై ధాన్యంపై బరకాలు కప్పారు. మామిడి రైతులు కూడా ఆందోళన చెందారు. ఈదురు గాలికి మామిడి కాయలు రాలాయి. మట్టి పని చేస్తున్న వారికి కూడా వర్షం అంతరాయాన్ని కలిగించింది.

27న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

యలమంచిలి: ఈ నెల 27వ తేదీ సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి శ్రీనివాసరావు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో నిబంధనలకు లోబడి సమావేశం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

అమ్మవారికి వెండి కుందుల సమర్పణ


వెండి కుందులు సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్లమ్మ అమ్మవారికి కర్నూల్‌కి చెందిన ఆర్.సౌమ్య రెడ్డి 300 గ్రాముల వెండి కుందులు అమ్మవారికి సమర్పించారు. ఆలయ ఉపప్రధాన అర్చకులు కొప్పేశ్వరరావు వీరికి పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి బుద్ద మహాలక్ష్మి నగేష్ ప్రసాదాలు, అమ్మవారి ఫోటో అందజేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు


భీమవరం ప్రకాశంచౌక్ సెంటర్‌లో పోలీసుల మాబ్ ఆపరేషన్ డ్రిల్ దృశ్యం

భీమవరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా పూర్తిచేయడానికి ప్రజలంతా సహకరించాలని ఎస్పీ వేజెండ్ల అజిత అన్నారు. శుక్రవారం భీమవరం ప్రకాశం చౌక్‌లో మాబ్ ఆపరేషన్ డ్రిల్ ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించారు. ఓట్లు లెక్కింపు సందర్భంగా శాంతిభద్రలకు విఘాతం కల్పించే విధంగా ప్రవర్తించే వారిని పోలీసు శాఖ ఏవిధంగా అణచివేస్తుందో వివరించారు. ఏఎస్పీలు వి భీమారావు, ఏటీపీ రవికుమార్, డీఎస్పీలు నున్న మురళీకృష్ణ, వి.నారాయణ స్వామిరెడ్డి, ఏఆర్ ఆర్ఐ శ్రీకాంత్ ఉన్నారు.

వినోదపు పన్ను వసూలులో అలసత్వం


నరసాపురం మునిసిపల్ కార్యాలయం

నరసాపురం: వినోదం, ప్రకటనల పన్నుల విషయంలో నరసాపురం మునిసిపాలిటీలో నష్టం జరుగుతోంది. కనీస మాత్రంగా కూడా వినోదం, ప్రకటనలకు సంబంధించి పన్నులు రావడంలేదు. ఏటా వచ్చే నామమాత్రపు ఆదాయం కూడా, ఏళ్ల తరబడి వసూలు కాకుండా, మొండి బకాయిగా మిగిలిపోతోంది. వినోదం పన్ను రూపంలో మునిసిపాలిటీకి ఏడాదికి రూ.4 లక్షలు వసూలు అవుతుంది. ఇక ప్రకటనల పన్ను అయితే రూ.1.23 లక్షలు. మొత్తంగా రూ.5.23 లక్షలు పన్నుల రూపంలో రావాల్సి ఉంది. ఏడాదికి మునిసిపాలిటీకి ఆస్తి, కుళాయిలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు తదితర రూపాల్లో రూ.2.75 కోట్లు ఆదాయం వస్తోంది. ఇందులో వినోదం, ప్రకటనల పన్నుల వాటా నామమాత్రంగా ఉంటోంది. వినోదం పన్నులు రూ.10 లక్షలు, వరకూ, ప్రకటనల పన్నులు రూ.3 లక్షల వరకూ బకాయిలు న్నాయి. వినోదం పన్నుల కోసం కేవలం సినిమా థియేటర్లపైనే ఆధారపడుతున్నారు. వినోద పన్నుల వసూలుకు నిబంధనల ప్రకారం ఇతర మార్గాలున్నా అధికారులు ఆ దిశగా దృష్టి సారించడం లేదు. ఇటీవల ఎక్కడ పడితే అక్కడ ప్రకటనల హోర్డింగ్స్, ఫ్లెక్సీలు కనిపిస్తున్నాయి. వీటి నుంచి కూడా పన్నులు వసూలు చేయడంలేదు. ఆదాయం వచ్చే మార్గాల్లో మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తూ అధికారులు మునిసిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నారు. వినోదం, ప్రకటనల పన్నుల విషయంలో ఉన్న లోపాలను సరిదిద్దే చర్యలు ఇప్పటికైనా చేపట్టాలనే ప్రజల నుంచి డిమాండ్లు వినిపిస్తున్నాయి.

సిమెంట్ బల్లల వితరణ


కనకదుర్గమ్మ ఆలయం వద్ద సిమెంట్ బల్లలు ఏర్పాటు చేసిన కాపు వనిత క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని పాదచారులు, ప్రయాణీకులు, భక్తులు కూర్చోవడానికి అనుకూలంగా ఉండాలనే ఉద్దేశంతో సిమెంట్ బల్లలు ఏర్పాటు చేసినట్లు యునైటెడ్ కాపు వనిత సర్వీస్ క్లబ్ అధ్యక్షురాలు మంగెన అరుణ తెలిపారు. శుక్రవారం పట్టణంలో అయ్యప్పస్వామి ఆలయం పూలపల్లి బైపాస్ రోడ్డు వద్ద ప్రయాణీకుల కోసం, కెనాల్ రోడ్డు కనకదుర్గమ్మ ఆలయం వద్ద భక్తుల కోసం, గాంధీబొమ్మల సెంటర్ వద్ద పాదచారుల కోసం దాతల సహకారంతో సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు. అరుణ మాట్లాడుతూ వనిత క్లబ్ ద్వారా బల్లలు ఏర్పాటుకు దాతలు డాక్టర్ ముచ్చర్ల సంజయ్, కొండ్రెడ్డి సూరిబాబు తమ సహకారం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో కాపు క్లబ్ గవర్నర్, డాక్టర్ ముచ్చర్ల సంజయ్, జక్కంపూడి కుమార్, పెనుమాక రామ్మోహన్, జక్కంపూడి మధన్, మంగెన సాయి, వనిత క్లబ్ సభ్యురాళ్లు శిద్దిరెడ్డి శైలజ, డాక్టర్ కావలి మౌని, రావి సృజన, నారిన సూర్యకుమారి, దేవరపు కాంచన మాల, ముళ్లపూడి లావణ్య, బంగారం మణి, గుండుమోగుల భారతి తదితరులు పాల్గొన్నారు.

మావూరమ్మ ఆలయ ఆవరణలో అన్నసమారాధన


బంగారువారి చెరువుగట్టు వద్ద మావూరమ్మను దర్శించుకుంటున్న గుడాల మంగతాయారు

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని బంగారువారి చెరువుగట్టులో వేంచేసియున్న మావూరమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ అన్నసమారాధనలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) భార్య మంగతాయారు పాల్గొని అన్నసమారాధనను ప్రారంభించారు. ముందుగా మంగతాయారు మావూరమ్మను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు వడ్డించారు. అన్న సమారాధనకు కె కిషోర్ వర్మ రూ.40వేలు, భక్తులు విరాళాలు అందజేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శంకరావు శ్రీనివాసు, ఉత్సవ కమిటీ సభ్యులు రౌతు అచ్యుతరావు, గొల్ల శ్రీను, మిరియాల సాయి, కాస్కాని రవి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చందక సత్తిబాబు, నాయకులు ఇజ్జాడ చినబాబు, జోగాడ ఉమామహేశ్వరరావు, ననమండ వీరాస్వామి పాల్గొన్నారు.

కూల్‌డ్రింక్ షాపుల్లో విజిలెన్స్ అధికారుల తనిఖీ

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని కూల్ డ్రింక్ షాపులో అనుమతులు లేకుండా సొంతంగా తయారు చేసిన సాఫ్ట్ డ్రింక్స్ విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కరణం కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక యడ్లబజారు సెంటర్‌నిఓ కూల్‌డ్రింక్ షాపులో విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. కూల్ డ్రింక్ షాపు యజమాని ఎలువంటి అనుమతులు లేకుండా అనధికారికంగా సాఫ్ట్ డ్రింక్స్ తయారు చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. డ్రింక్స్ నమూనాలు తీసుకుని ఫుడ్ సేఫ్టీ పరీక్షా కేంద్రానికి పంపిస్తామన్నారు. షాపు యజమానిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పి శివరామకృష్ణ, ఎస్సై సిహెచ్ రంజిత్ కుమార్, ఫుడ్ సేఫ్టీ అధికారి సుందర రామిరెడ్డి, తూనికలు కొలతలు అధికారి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చాంబర్స్ కళాశాలలో బీబీఏ గ్రూపునకు ఏఐసీటీఈ గుర్తింపు


ఏఐసీటీఈ గుర్తింపు పత్రాన్ని చూపిస్తున్న కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బీఆర్ఆర్ అండ్ జీకేఆర్ చాంబర్స్ డిగ్రీ కళాశాలకు బీబీఏ హానర్స్ కోర్సుకు ఏఐసీటీఈ (ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) న్యూఢిల్లీ వారి గుర్తింపు లభించిందని కళాశాల చైర్మన్ కారుమూరి నరసింహారావు అన్నారు. శుక్రవారం స్థానిక కళాశాల ఆవరణలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ 2024–25 సంవత్సరం నుంచి ఏఐసీటీఈ వారి అనుబంధంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వారి అఫిలియేషన్‌తో 60 సీట్లకు ప్రవేశాలు ఉంటాయన్నారు. పట్టణంలో ఏఐసీటీఈ, న్యూఢిల్లీ గుర్తింపుతో బీబీఏ కోర్సు నిర్వహిస్తున్న ఏకైక డిగ్రీ కళాశాల చాంబర్స్ కళాశాల ఒక్కటేనని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ కళాశాలలో బీబీఏ, బీసీఏ కోర్సులకు గుర్తింపును ఇస్తామన్నారు. తద్వారా విద్యా ప్రమాణాలు, స్కాలర్‌షిప్పులు, ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి వంటి విషయాల్లో జాతీయస్థాయి ప్రమాణాలు డిగ్రీ కళాశాలలోనూ కొనసాగుతాయన్నారు. వీటికి ఏఐసీటీఈ సంస్థ సహకరిస్తుందని తెలిపారు. బీబీఏ ఏర్పాటుకు ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం బోధన, అధ్యాపకులు, కంప్యూటర్ ల్యాబ్‌లు, లైబ్రరీ వంటి వసతులను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసామన్నారు. జులైలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కలిదిండి రామరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ దిరిశాల వెంకటేశ్వరరావు, నందుల సీతారామారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీదే మళ్లీ అధికారం

వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి దేవ రాజేష్‌కుమార్



పాలకొల్లు అర్బన్: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రాబోతుందని ఆ పార్టీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి దేవ రాజేష్‌కుమార్ జోస్యం చెప్పారు. పాలకొల్లులో ఆయన శుక్రవారం మాట్లాడారు. రాష్ట్రంలో 135 పైగా అసెంబ్లీ స్థానాలను వైఎస్సార్ సీపీ గెలుచుకోబోతోందన్నారు. రాష్ట్రంలో జరిగిన పోలింగ్ సరళిని పరిశీలిస్తే గత ఐదేళ్లలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ఆర్థికంగా లబ్ధి చేకూర్చారన్నారు. ముఖ్యంగా మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదలు, వృద్ధులు, దివ్యాంగులు వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఓటు వేశారన్నారు. వలంటీర్ల, సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రజలకు అందుతున్న సేవల పట్ల ప్రజలు పూర్తిగా సంతృప్తి చెందారన్నారు. అన్ని సర్వే సంస్థలు కూడా వైఎస్సార్ సీపీ విజయం సాధించబోతోందని వెల్లడించాయన్నారు. రెండోసారి ముఖ్యమంత్రిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జూన్ 9న విశాఖపట్టణంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారని వివరించారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) విజయం సాధించబోతున్నారన్నారు. ఈ నెల 13న జరిగిన పోలింగ్‌లో గ్రామీణ మహిళలు ఎక్కువగా ఓటింగ్‌లో పాల్గొన్నారన్నారు. మహిళలంతా అనేక పథకాల ద్వారా ఎంతో లబ్ధి పొందారన్నారు. వీరంతా వైఎస్సార్ సీపీకే మద్దతుగా నిలిచి ఓటు వేశారన్నారు.

రేపు ఏబీఎస్‌వీకే ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం

భీమవరం(ప్రకాశంచౌక్): పట్టణంలోని మెంటే వారి తోటలోని సుందరయ్య భవనంలో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రంలో విజయవాడకు చెందిన వైద్యులు డి .సందీప్ వర్మ, జి. పద్మజ, జి.సత్యనారయణరాజు తదితరులు పాల్గొని వైద్య సేవలు అందజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల ప్రచారం


కవిటంలోని జెడ్పీ పాఠశాల


మార్టేరులో ఎస్వీజీ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రచారం


సిద్ధాంతంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల

పెనుగొండ: కొత్త విద్యా సంవత్సరంలో విద్యార్థులను ఆకర్షించేందుకు కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులూ ప్రచారంలో దూసుకుపోతున్నాయి, కార్పొరేట్ పాఠశాలల బాటలో గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటుతో పాటు, సోషల్ మీడియాలో ప్రచారానికి తెరతీశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాడు– నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ కల్పించారు. దీంతో పాటు ఇంగ్లీషు మీడియం ప్రవేశ పెట్టడంతో పేదింటి పిల్లలు ప్రభుత్వ పాఠశాలల వైపు ఆకర్షితులవుతున్నారు. వీరితో పాటు మధ్యతరగతి విద్యార్థులను కార్పొరేట్ వైపు వెళ్లకుండా, ప్రభుత్వ బడుల వైపు మళ్లిస్తున్నారు. చంటనియోజకవర్గంలో మొదటి దశలో 67 పాఠశాలలకు, రెండవ దశలో 147 పాఠశాలల మహర్దశ కలిగింది. మొదటి దశలో పెనుగొండ మండలంలో 16, ఆచంట మండలంలో 14, పెనుమంట్ర మండలంలో 19, పోడూరు మండలంలో 18 పాఠశాలలను రూ.11,85,43,000 నిధులతో తీర్చిదిద్దగా, రెండవ దశలో పెనుగొండ మండలంలో 32 పాఠశాలలు, ఆచంట మండలంలో 44 పాఠశాలలు, పెనుమంట్ర మండలంలో 29 పాఠశాలలు, పోడూరు మండలంలో 42 పాఠశాలలను రూ.44, 42, 13,000 వ్యయంతో తీర్చిదిద్దారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల నూతన శోభతో కళకళలాడుతున్నాయి. దీనిని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవడానికి విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు.

మా ప్రత్యేకతలు ఇవే..

ప్రభుత్వ పాఠశాలలు మా ప్రత్యేకతలు ఇవే అంటూ ప్రచారం చేసుకుంటున్నాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు గత విద్యా సంవత్సరంలో సాధించిన మార్కులు ప్రకటించడంతో పాటు, ఫీజులు భారం లేని ఉచిత విద్య, ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉచిత మెటీరియల్, మధ్యాహ్నం రుచికరమైన భోజన సదుపాయం, ఇతర ప్రభుత్వ రాయితీలు, వసతులు, కార్పొరేటుకు దీటుగా మౌలిక సదుపాయాలు అంటూ విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంతో కార్పొరేటు పాఠశాలలు ఢీలా పడుతున్నాయి.

పండ్ల వినియోగంపై మక్కువ

- పండ్ల రసాలకు ప్రాధాన్యతనిస్తున్న ప్రజలు
- ఆకాశాన్నంతుతున్న ధరలు


పాలకొల్లులో పండ్ల దుకాణం

పాలకొల్లుసెంట్రల్: ఎండలు మండుతున్నాయి.. నేటి నుంచి రోహిణీ కార్తె ప్రారంభం కానుంది. ఉష్ణోగ్రతలు తారాస్థాయికి చేరుకోవడంతో ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వేడిని తట్టుకోలేక జనంలో నిస్సత్తువ కనిపిస్తోంది. రోగాలను తట్టుకునేలా శరీరంలో సత్తువ పెరిగి, రోగ నిరోధక శక్తి వృద్ధి చెందేందుకు పండ్లు, పండ్ల రసాలు తీసుకోవాలని ఆహార నిపుణులు, వైద్యులు సూచిస్తున్నారు. దీంతో అందరూ పండ్లపై ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. దానితో మార్కెట్లో యాపిల్, దానిమ్మ, పైనాపిల్, కమలా, బత్తాయి, పనస, తర్బూజ, ద్రాక్ష, బొప్పాయి, అరటి పండు, డ్రాగన్ ఫ్రూట్, కివీ వంటి పండ్ల ధరలు వేసవిని మించి సెగలు పుట్టిస్తున్నాయి.

ఆరోగ్యమే మహాభాగ్యం

వ్యక్తిగత ఆరోగ్యం కోసం పోషక విలువలు కలిగిన పండ్లపై జనం ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. శీతల పానీయాల వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని విస్తృత ప్రచారం జరుగుతుండడంతో అధిక శాతం ప్రజలు శీతలపానీయాలకు దూరంగా ఉంటున్నారు. అధిక సంఖ్యలో ప్రజలు పండ్లు, పండ్ల రసాలపై ఎక్కువ మక్కువ చూపిస్తున్నారు. గతంలో పట్టణ, మండల ప్రధాన కూడళ్లలోనే ఎక్కువగా పండ్ల వ్యాపారం సాగేది. నేడు ప్రతి రహదారి పొడవునా వ్యాపారాలు కొనసాగుతున్నాయి. అందులోనూ ప్రస్తుతం మామిడి పండ్ల సీజన్ కావడంతో మామిడి ప్రియులు వాటిపై ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. మామిడి పండ్ల ధరలు మరింత ప్రియమవ్వడంతో కొంత ఇబ్బంది పడినా సీజనల్ పండు కావడంతో కొనాల్సి వస్తోందని పలువురు అంటున్నారు.

మార్కెట్‌లో సెగలు పుట్టిస్తున్న పండ్ల ధరలు

మార్కెట్‌లో అన్ని రకాల పండ్లు అందుబాటులో ఉన్నా వాటి ధరలు మాత్రం అందనంత ఎత్తులో ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో పండ్లు కిలో ధరల్లో చూస్తే దానిమ్మ రూ. 160, యాపిల్ రూ. 200, ద్రాక్ష రూ. 100, పుచ్చకాయ రూ.20, తర్బూజ రూ. 30, బత్తాయి రూ. 60, కమలా డజను రూ. 200, ఒక్కో పండు ధర పలికే పండ్లు డ్రాగన్ ఫ్రూట్ ఒకటి రూ. 60, కివీ రూ. 20, అవకడ రూ. 80, ఫియర్స్ యాపిల్ రూ. 40, గ్రీన్ యాపిల్ రూ. 30 ధరలు ఇలా ప్రియం అవ్వడంతో కొనుగోలుదారులు గగ్గోలు పెడుతున్నారు. జ్యూస్ సెంటర్లు ఎక్కువగా పెరగడంతో పండ్ల ధరలకు రెక్కలు వచ్చాయంటున్నారు.

ప్రజలకు ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది



కోవిడ్ వచ్చిన నాటి నుంచి వినియోగదారుల్లో ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. పండ్ల వాడకం అధికంగా పెరిగింది. సరుకు అందుబాటులో ఉండడం లేదు. అందువల్ల ధరలు ఎక్కువగానే ఉన్నాయి. వారం రోజులు నుంచి వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో రైతులు మామిడి పండ్లను ఒబ్బిడి చేసుకునే ప్రయత్నంలో రైతులు నిమగ్నమయ్యారు. దానితో ప్రస్తుతం టన్ను మామిడి ధర రూ. 30 వేలు నుంచి రూ. 45 వేలుకు పడిపోయాయి. వర్షం తగ్గాక మామిడి ధర మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

– ఆకుల శివప్రసాద్, పండ్ల వ్యాపారి, పాలకొల్లు